క్లుప్తంగా

గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం



పోషకాహారం అందజేస్తున్న ప్రతినిధులు, వైద్యులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని ఎస్‌వీ పూజా హాస్పిటల్‌లో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ బంజారా హిల్స్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత హెల్త్‌ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ క్యాంపులో గర్భిణులకు వైద్యురాలు ప్రేమలత సలహాలు, సూచనలు అందజేశారు. పోషక ఆహారం తీసుకోవటం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని తెలిపారు. సుమారు 50 మందికి పండ్లు, బిస్కెట్‌, పోషకాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, రోటరీ క్లబ్‌ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులకు ఎముకల గురించి అవగాహన కల్పించిన డాక్టర్‌

ఆల్విన్‌కాలనీ: మానవ శరీరంలోని ఎముకలు ఎంత బలంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్‌ ఎస్‌. వంశీరెడ్డి అన్నారు. మంగళవారం చిరాక్‌ ఇంటర్‌ నేషనల్‌ స్కూల్‌లో విద్యార్థులకు మానవ ఎముకలపై అవగాహన కల్పించారు. ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పెరుగు, బాదం, ఆకు కూరలు వంటి పదార్థాలు పిల్లలకు ఎక్కువ మోతాదులు అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మార్కెట్‌లో దొరికే జంక్‌ ఫుడ్‌, కల్తీ ఆహార పదార్థాలు తీసుకోకూడదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని భవానీనగర్‌ నివాసి పి. శ్రీనివాస్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారు. ఆ ఎల్‌వోసీని బీఆర్‌ఎస్‌ డివిజన్‌ మహిళా అధ్యక్షురాలు లలితా ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలాజీనగర్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికార ప్రతినిధి శ్యామల, కారుమూరు వెంకటరెడ్డి



జన నేతకు ఘన నివాళి

- ఘనంగా వైఎస్సార్‌ జయంతి వేడుకలు
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించిన నేతలు, అభిమానులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌. రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ, వైఎస్సార్‌ సీపీ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వైఎస్సార్‌ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. కూకట్‌పల్లిలోని రమ్యా గ్రౌండ్‌ వద్ద గాలిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరై కేక్‌కట్‌ చేశారు. బాలాజీనగర్‌ డివిజన్‌లో ఐస్‌క్రీమ్‌ వెంకటరెడ్డి యక్కంటి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా అధికార ప్రతినిధి శ్యామల, కారుమూరు వెంకటరెడ్డి హాజరయ్యారు. పారిశ్రామిక వేడుకల్లో వెంకట సుబ్బారెడ్డి, రఘునాథ రెడ్డి, నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, భరత్‌నగర్‌లో దేవి రెడ్డి మనోహర్‌ రెడ్డి, ప్రసాద్‌ రెడ్డి, హరినాథ్‌ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలేసి నివాళులర్పించారు. కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌ బస్టాప్‌లోని వైఎస్సార్‌ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి జోన్‌ బృందం



కేపీహెచ్‌బీ టెంపుల్‌ బస్టాప్‌ వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



రమ్యా గ్రౌండ్స్‌ వద్ద కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్సీ శివరామి రెడ్డి, గాలి రెడ్డి, జీఎల్‌ఎన్‌ రెడ్డి, సుబ్రహ్మణ్యారెడ్డి



ప్రశాంత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న వెంకట సుబ్బారెడ్డి, రఘునాథ రెడ్డి, నర్సింహారెడ్డి



కేక్‌ తినిపిస్తున్న కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌ రెడ్డి, బండి రమేష్‌, సత్యం శ్రీరంగం



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు



పాపిరెడ్డినగర్‌లో.. నివాళులర్పిస్తున్న ఆనంద్‌, వెంకటేశ్వరరావు తదితరులు



నివాళులర్పిస్తున్న తడక జగదీశ్వర్‌ గుప్తా



భరత్‌నగర్‌లో.. దేవిరెడ్డి మనోహర్‌ రెడ్డి, ప్రసాద్‌ రెడ్డి



కార్పొరేటర్‌ కార్యాలయంలో.. దొడ్ల వెంకటేష్‌

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ సమీపంలోని అంబేడ్కర్‌ నగర్‌, రైల్వే ట్రాక్‌ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారే సమాచారం అందింది. పోలీసులు సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించగా అంబేడ్కర్‌ నగర్‌కు చెందిన ఎల్లారం రాములు (24), కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన పిట్ల శ్రీకాంత్‌ (25)లుగా తెలిపారు. వారి నుంచి 35 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌ గాంధీ నగర్‌ ఏ బ్లాక్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్‌ సబిహా బేగం మంగళవారం జలమండలి మేనేజర్‌ సయ్యద్‌ జాకీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంత కాలంగా ఉన్న మురుగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. త్వరలోనే నీటి నిల్వలు, రోడ్లపై మురుగు ప్రవాహం వంటి సమస్యలు తొలగిపోతాయని అన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించటానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు సయ్యద్‌ రియాజ్‌, కొండయ్య, మల్లేష్‌, కృష్ణ, నరసింహారెడ్డి, ముత్యాల దుర్గ, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న ఏసీపీ నరేష్‌ రెడ్డి

- బాలానగర్‌ ఏసీపీ నరేష్‌రెడ్డి
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌

బాలానగర్‌: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని బాలానగర్‌ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు. రానున్న బోనాల వేడుకలను దృష్టిలో ఉంచుకొని బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఉన్న 8 మంది రౌడీషీటర్లకు, సస్పెక్ట్‌ షీటర్లకు మంగళవారం బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. బోనాల వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వీరిపై పీడీ యాక్ట్‌ పెట్టి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని సూచించారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై రౌడీషీట్‌ ఎత్తివేసే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మారాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నరసింహ రాజు, ఎస్‌ఐలు సరళ, వినోద్‌కుమార్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి



మాట్లాడుతున్న రవికుమార్‌ యాదవ్‌

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌ యాదవ్‌

ఆల్విన్‌కాలనీ: కొత్త, పాత అనే తేడా లేకుండా రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్‌ డివిజన్‌ నూతన కార్యవర్గ సమావేశం ఆదిత్య నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్‌ అధ్యక్షులు అరుణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై దృష్టి సారించి రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేసే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సమావేశంలో డివిజన్‌ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, కో కన్వీనర్‌ మణిభూషణ్‌, డివిజన్‌ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సెక్రటరీలు, బూత్‌స్థాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏఎంఓ రవీందర్‌రాజు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో అన్ని రకాల సబ్జెక్టులకు సాంకేతికరణ జోడిస్తూ విద్యా బోధన కొనసాగుతుందని తెలిపారు. పలు సంస్థల సహకారంతో డిజిటల్‌ పాఠాలు అందించబోతున్నామని, పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు వాటి సహకారంతో విద్యా బోధన అందించాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పరీక్ష

కూకట్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2025–27 సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్‌ల కోసం పాఠశాల స్థాయి 8వ తరగతి విద్యార్థుల ఫిజికల్‌ సెలక్షన్స్‌, రాత పరీక్ష మంగళవారం నిర్వహించారు. ఎన్‌సీసీ బెటాలియన్‌ అధికారి తుల్జారాం ఆధ్వర్యంలో నిర్వహించారు.